క్లుప్తంగా

భగవద్గీతపై ప్రచారం



కందికాయపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని కందికాయపల్లె, తమ్మురాజుపల్లె గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు మాట్లాడుతూ.. ఆషాఢమాసం, గురుపౌర్ణమి సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ప్రతి మనిషి త్రైతసిద్ధాంతం చదివి గురు పౌర్ణమి రోజున శ్రీకృష్ణ పరమాత్ముడిని గురువుగా భావించి పూజించాలని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. నిర్వాహకులు పుల్లారెడ్డి, సంజీవ, నాగమద్దిలేటి, లక్ష్మీనారాయణ, రమణమ్మ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోడుమూరు రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు బాలికలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద, విద్యార్థులకు కళాశాల పక్కనే హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొత్తూరులో డీఐజీ సతీమణి పూజలు



సుష్మ జెట్టికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు, సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గ్రేహౌండ్స్ డీఐజీ గోపినాథ్‌జెట్టి సతీమణి సుష్మజెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చన తదితర పూజలు చేశారు. ఆలయ సిబ్బంది వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. సిబ్బంది సుబ్బక్రిష్ణ, నాగేశ్వరరావు, అర్చకులు నారాయణ, కిట్టయ్య తదితరులు పాల్గొన్నారు. గోపినాథ్ జెట్టి గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్పీగా పని చేశారు.

ఓర్వకల్లులో అర్ధరాత్రి చోరీ



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జున

ఓర్వకల్లు: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పెండేకంటి నగర్‌లో నివాసం ఉంటున్న కురువ వెంకటేశ్వర్లు, అతని భార్య కలిసి ఇంటి బయట నిద్రించారు. అదే అదనుగా భావించిన దుండగులు ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి చొరపడ్డారు. ఇంట్లోని బీరువాను ఇనుపరాడ్‌తో పెకలించి 8 తులాల బంగారు నగలు, రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. ఉదయం దంపతులు లేచి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో వచ్చి దుండగుల వేలిముద్రలను సేకరించారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

12న ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై సమావేశం

కోడుమూరు రూరల్: ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఈనెల 12న బుధవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ అజయ్‌భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పట్టణంలోని హోటళ్లు, కిరాణ, కూరగాయలు, పండ్ల దుకాణాల వ్యాపారులు తప్పక హాజరై ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై తమ అభిప్రాయాలను తెలపాలని ఈఓ కోరారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు, ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పాసై, ఇంటర్మీడియెట్ పాస్/ఫెయిల్, డిప్లమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు 18 నుంచి 26 ఏళ్ల వయస్సు ఉన్న వారు శిక్షణకు హాజరు కావచ్చన్నారు. 35 రోజుల కోర్సులో ట్యాలీ, జీఎస్‌టీ, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్, లైఫ్ , ఇంటర్వ్యూ, వర్క్‌ప్లేస్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9000487423 నంబరును సంప్రదించాలన్నారు.

పేదల సంక్షేమానికి సు'రక్ష'



బాలాజీనగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారురాలికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం 39వ వార్డులో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందిస్తున్నారని కొనియాడారు. సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి వారికి తక్షణమే అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు సంపన్నుల కోసం మాత్రమే పని చేశారని, 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. జగనన్న పాలనలో కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతోందని వివరించారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. సొంత పుత్రుడు నారా లోకేష్ యువగళం యాత్ర, దత్తపుత్రుడు వారాహి యాత్రలతో ఎలాంటి ప్రయోజనం లేదని, ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వారు ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. నగర పాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, బాలాజీనగర్ ప్రజలు పాల్గొన్నారు.

జగనన్నకు కృతజ్ఞతలు



గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం నెల రోజులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాను. ప్రస్తుతం కొత్త సర్టిఫికెట్ కోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ల సహకారంతో దరఖాస్తు చేసుకోగా ఒక్కరోజులోనే కుల ధ్రువీకరణ పత్రం అంజేశారు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందించేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు. – షేక్ జరీన, బాలాజీనగర్

సంతోషంగా ఉంది



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు మా ఇంటికి వచ్చి ఏమైనా సర్టిఫికెట్లు కావాలా అని అడిగారు. నేను కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని చెప్పాను. నాతో దరఖాస్తు రాయించుకుని వెళ్లి, ఒక్క పైసా ఖర్చు లేకుండా సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నాకెంతో సంతోషంగా ఉంది.
– షేక్ జమీలాబేగం, బాలాజీనగర్

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు



జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్ సహకారంతో కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు దరఖాస్తు చేసుకున్నాను. గతంలో నెల రోజుల పాటు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగితే తప్పా మంజూరయ్యేది కాదు. ప్రస్తుతం ఎన్నడూ లేని విధంగా కేవలం ఒక్కరోజులోనే కులధ్రువీకరణ పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే సేవలు అందించడం ఆనందదాయకం. – నవీనప్రియ, విద్యార్థిని, స్టాంటన్‌పురం

నేడు పులకుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

నేడు జగనన్న సురక్ష సదస్సులు

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్‌ల ఆధ్వర్యంలో, బురాన్‌దొడ్డి గ్రామంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తుల ఆధ్వర్యంలో మంగళవారం ఆయా గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష సదస్సులు జరగనున్నాయి. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కోడుమూరు రూరల్: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కింద స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం 70మంది గర్భిణులకు డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై గైనకాలజిస్ట్ పుష్పలత అవగాహన కల్పించారు.

ఇళ్ల ముంగిటకే సేవలు

● కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్



కె.నాగలాపురంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: పల్లెల్లో సచివాలయాలను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తెచ్చారని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. కె.నాగలాపురంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకునివచ్చి ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు, కుల, మతాలకు తావులేకుండా అర్హులందరికీ అందజేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మౌలాలి, వైస్ ఎంపీపీ రాజమ్మ, ఎంపీడీఓ మాధవీలత, నాయకులు నరసింహారెడ్డి, సుందరం, బజారి, శీను, మహేశ్వరరెడ్డి, సుంకన్న, డిష్ వెంకటేష్, మగ్బుల్, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): జనసేన అధినేత పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని, సినిమాల్లో చేసే కోతి చేష్టలను మానుకోవాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హితవు పలికారు. సోమవారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏలూరులో వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ గ్రామ/వార్డు వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడడం దారుణమన్నారు. వలంటీర్లు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి వారి సమాచారాన్ని సంఘ విద్రోహులకు అందిస్తున్నారని చెప్పడం పూర్తి అవాస్తవమని, ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో, నీరు చెట్టు పేరుతో నాయకులు డబ్బులు దోచుకోవడం కనిపించలేదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తే అప్పుడు ఎందుకు మాట్లాడలేదన్నారు. పవన్ కల్యాణ్ సినిమా హీరో అయి ఉండొచ్చని ఆయన వ్యాఖ్యలు నీచంగా ఉన్నాయన్నారు. ఎన్నికల ఏడాదిలో మరోసారి ప్రజల ముందుకు వచ్చి ప్యాకేజీ స్టార్ అని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు బాలకృష్ణ, విద్యాసాగర్, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జ్యోతి, సుందరం, గోపాల్, మద్దిలేటి, ప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలి

గడివేముల: సేవా భావంతో పనిచేస్తున్న వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేయడం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు తగదని మండల ఉపాధ్యక్షుడు కాలునాయక్ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ఎల్‌కే తాండా గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. ఏలూరు వారాహి బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఆయన స్వభావానికి నిదర్శనం అన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని, జనాదరణ లేకే పవన్‌కల్యాణ్ రెండు చోట్లా ఓడిపోయారని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలను గుర్తు చేశారు. వలంటీర్లపై చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకొని పవన్‌కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కౌలూరులో మొక్కలను పరిశీలిస్తున్న డాక్టర్ సురేంద్రకుమార్

పాణ్యం: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ డాక్టర్ సురేంద్రకుమార్ సూచించారు. ఆయన సోమవారం మండలంలోని కౌలూరు, బలపనూరు గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యానవన పంటల సాగు, పూడికతీత, చెక్‌డ్యాం, పంటకాల్వ పూడికతీత తదితర పనులను తనిఖీ చేశారు. కూలీలకు రోజువారీ వేతనం రూ.272 వచ్చేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్నారు. కూలీలకు జమ అయ్యే వేతనం గురించి అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డులను పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు. టీఏ నాగరాజు, కృష్ణవేణి, విజేయుడు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



దిన్నెదేవరపాడులో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి ఉసేనయ్య కోరారు. సోమవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు, పసుపల, గార్గేయపురం గ్రామాల్లో పర్యటించి స్థానిక సమస్యలపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలు నిర్మించి మురుగు నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు. స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలన్నారు. సామూహిక మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, మండల నాయకులు ఆంజనేయులు, శ్రీరాములు, సుభాకర్, బీసన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ ఇష్టానుసారం



గడివేముల తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ కుర్చీ

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కళావతి విధి నిర్వహణలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టడం, మధ్యాహ్న వేళకు గానీ రోజువారీ విధులకు హాజరు కావడం లేదని పలువురు అర్జీదారులు వాపోతున్నారు. సోమవారం స్పందన కార్యక్రమం ఉన్నా ఆమె హాజరు కాలేదు. దీనిపై జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులును వాకబు చేయగా తనకు కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని, వాట్సప్‌లో సందేశం పంపినట్లు చెప్పుకొచ్చారు. దీంతో ఆమెకు హాజరు ఎలా వేస్తారని ప్రశ్నించగా తహసీల్దార్ ఆబ్సెంట్ వేశారు. ఈమె తీరుపై ఇటీవల పలువురు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఉన్నతాధికారులను మందలించారు. జూనియర్ అసిస్టెంట్‌ను మార్చి సమర్థత గలవారిని నియమించాలని అర్జీదారులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



కషాయం తయారీని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

కల్లూరు: రైతులతో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయించాలని థిమాటిక్ లీడ్, రీజనల్ కో–ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య సూచించారు. సోమవారం బొల్లవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన సుధాకర్, వెంకటేశ్వరమ్మ పొలాలను సందర్శించారు. అధికారులు మాట్లాడుతూ.. సహజసిద్ధంగా పండించిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. పంటలకు వచ్చే పురుగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించి, వాటి నివారణకు కషాయ ద్రావణాలు, సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మునిరాజ్, మల్లికార్జున, మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ పేరుతో పట్టా ఇవ్వాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీ రెండు ట్యాంకుల వద్ద ఉన్న రోడ్డు సైడ్ పోరంబోకు స్థలాన్ని కేవీపీఎస్ పేరుతో పట్టా చేసి ఇవ్వాలని ఆ సమితి నగర కార్యదర్శి భాస్కర్, రోశయ్య, జమ్మన్న, సీపీఎం నాయకులు రాముడు, అలివేలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కల్లూరు తహసీల్దార్ టీవీ రమేష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. 2010 సంవత్సరంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) సంఘం అంబేడ్కర్ పేరుతో నిర్మించిన గ్రంథాలయం స్థలానికి కొందరు అక్రమంగా పట్టా సృష్టించారన్నారు. అక్రమ పట్టాను రద్దు చేసి గ్రంథాలయ స్థలాన్ని కేవీపీఎస్ పేరుతో పట్టా చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జానీ, సీహెచ్ సాయిబాబా, మద్దిలేటి, రహీమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్టవద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల పి.జి.టి బాలికలు (క్రీడా పాఠశాల)లో ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. ఆమె సోమవారం మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. 6వ తరగతిలో నూతన ప్రవేశాలు, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కర్నూలు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని గిరిజన గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని ఎస్టీ విద్యార్థులను క్రీడా పోటీల ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న క్రీడాపోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్రీడల్లో పాల్గొనదలిచిన వారు ఆయా పాఠశాల హెచ్ఎంలచే ధ్రువీకరణ పత్రంతో రావాలన్నారు. 6వ తరగతిలో 30 సీట్లు, 7వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 24 సీట్లు, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ సెల్ 81069 79149, పీడీ సెల్ 83417 67718 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నేడు సబ్సిడీపై టమాటా పంపిణీ

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని రైతుబజార్లలో మంగళవారం సబ్సిడీ టమాట పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి సోమవారం తెలిపారు. మదనపల్లిలో కొనుగోలు చేసి, కర్నూలుకు తీసుకువచ్చేందుకు కిలో టమాటాకు రూ.113.09 అయ్యిందని, వినియోగదారుల సౌకర్యార్థం రూ.50 విక్రయిస్తామని చెప్పారు. మిగతా రూ.63.09 ప్రభుత్వం భరిస్తుందన్నారు. సి.క్యాంప్, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లలో ఆధార్/రేషన్ కార్డు జిరాక్స్ కాపీ ఇచ్చి టమాట కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

పెయింటర్ ఆత్మహత్య

కర్నూలు: స్థానిక బి.క్యాంప్‌లోని అరోరా నగర్ చిన్న జమ్మిచెట్టు సమీపంలో నివాసముంటున్న భాస్కర్ (35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పెయింటర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కూతురు సంతానం. ఆమెను వదిలేసి ప్రస్తుతం రెండో భార్య జయశ్రీతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం మద్యం తాగి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక కాచిగూడ నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పీఎస్ ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి మృతుని కుటుంబానికి సమాచారమిచ్చారు. ఇతను గతంలో కూడా రెండుసార్లు రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సి.బెళగల్ స్పందనలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోడుమూరు రూరల్: మండలంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కోడుమూరు తహసీల్దార్ జయన్న తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చి పంపారు. అర్జీల పరిష్కారం నిర్లక్ష్యం వద్దని, త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మంజుల, ఎంఈఓ శరభయ్య, హౌసింగ్ ఏఈ లక్ష్మన్న, హార్టికల్చర్ ఆఫీసర్ మధుమోహన్ తదితరులున్నారు.

– గూడూరు: స్పందన కార్యక్రమంలో వచ్చే వినతులపై సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, ఎప్పటికప్పుడే పరిష్కారం చూపాలని, వీలు కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవీలత, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఎంఈఓ సునీలమ్మ, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస నాయక్, ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

– సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి తహసీల్దార్ శేషఫణి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్ కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ ఏఈలు గోనేనాయక్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలల బలానికి 'గోరు ముద్ద'





గూడూరు జెడ్పీ బాలుర పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు, రాగి జావ అందిస్తున్న దృశ్యం

● పోషకాలతో కూడిన మెనూ
● రాగి జవాతో మరింత బలవర్ధకం


మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
కోడుమూరు	54	10,286
సి.బెళగల్	50	10,379
గూడూరు	32	5,517
కర్నూలు	197	73,479

గూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ అమలుచేస్తోంది. వారికి పౌష్టికాహారం అందించేలా రోజుకో రకం వంటకంతో మెనూ సిద్ధం చేసింది. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఊరటనిస్తోంది. సోమవారం వేడి పొంగలి, ఉడికించిన గుడ్డు, వెజ్ రైస్, చిక్కి ఇలా రోజుకో రకం వంటకాలను వడ్డిస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెనూలో మార్పులు చేయడంతో విద్యార్థులు ఇష్టంగా భోజనం తింటున్నారు.

రాగి జావాతో ఎంతో మేలు

విద్యార్థుల మెనూలో కొత్తగా రాగి జావా చేర్చడంతో ఎంతో ప్రయోజకరంగా మారింది. విద్యార్థులు పాఠశాలకు పోయిన వెంటనే ఉదయం రాగి జావా ఇస్తుండడంతో వారిలో ఉత్సాహంగా తరగతులకు హాజరవుతున్నారు.

భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు



ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరు ముద్ద పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ఆయా పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలయ్యేలా కృషి చేస్తున్నాం.
– సునీలమ్మ, ఎంఈఓ, గూడూరు

రాగి జావ ఎంతో బాగుంది



పాఠశాలలో ఉదయం అందించే రాగి జావ ఎంతో బాగుంది. మా ఇంటిలో కూడా ఇలా చేయరు. ఉదయాన్నే రాగిజావ ఇవ్వడం వల్ల ఉత్సాహంగా తరగతులకు హాజరవుతున్నాం.
– రంగస్వామి, విద్యార్థి